సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



చింతపల్లిలో తొలి సిజేరియన్

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో సోమవారం తొలిసారిగా సిజరియన్ కాన్పుచేశారు. 8లో



గైర్హాజరుపై కఠిన చర్యలు 8లో

ఉపాధ్యాయులు తరగతులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు హెచ్చరించారు.



గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ సేవలు

గిరిజనులకు పోలీస్‌శాఖ చేపడుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



ఉద్యానవన శాఖ డైరీని ఆవిష్కరిస్తున్న రంపచోడవరం పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించే బాధ్యత అధికారులపై ఉందని, ఈ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశం హాలులో సోమవారం ఉద్యానవన పంటలకు సంబంధించిన డైరీని పీవో ఆవిష్కరించి, సిబ్బందికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరీలో గల ఉద్యానవన పంటలకు సంబంధించిన అంశాలను అధికారులు, సిబ్బంది అధ్యయనం చేసి క్షేత్రస్థాయిలో రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో కె.చిట్టిబాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి రాంబాబు, హార్టికల్చర్ అధికారి ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు రోజుల్లో ధాన్యం సొమ్ము చెల్లింపు

రాజవొమ్మంగి: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును మరో రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని సివిల్ సప్లయ్స్ డీఎం గణేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 26,700 టన్నుల ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.53 కోట్ల విలువైన 26 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాలకు రూ.25 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. మరో రూ.28 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ సొమ్ము మరో రెండు రోజుల్లో జమ అవుతుందని ఆయన తెలిపారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్పందనలో స్వీకరించే అర్జీలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. సత్వరం పరిష్కారం కాని వాటిని సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్లో రంపచోడవరం ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సుమారు 60 దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. ఈఈ నాగేశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌పై టీడీపీ కార్యకర్తల దాడి



గురుమూర్తిని పరామర్శిస్తున్న ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: మండలంలోని సిర్గం పంచాయతీ కోడిపుంజువలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సచివాలయ పరిధి కన్వీనర్ గురుమూర్తిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పూజారి మాణిక్యం,నాగేశ్వరరావు ఆదివారం రాత్రి దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన గురుమూర్తిని ఆయన బంధువులు 108 వాహనంలో అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేస్తున్నారు. ఈవిషయం తెలుసుకున్న ఎంపీపీ ఉషారాణి సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి, సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 9న వర్రె గ్రామంలో టీడీపీకి చెందిన 60 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరాయని, వారు పార్టీ మారడంలో గురుమూర్తే కీలకంగా వ్యవహరించారని భావించి దాడి చేశారని ఆమె చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ రామన్న, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పూర్ణ,నర్సింగ్ తదితరులున్నారు.



● కనుల'పంట'

ఏ గ్రామంలో చూసినా ఈ ఏడాది పనస కాయలు విరగ్గాశాయి. తూటంగి పంచాయతీ గేదలబందలో ఓ పనస చెట్టుకు మొదలు నుంచి చివరి కొమ్మ వరకు కాయలు అధికంగా కాశాయి. అధిక దిగుబడి చూసి అక్కడి గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– డుంబ్రిగుడ



● చలితో తంటా

మళ్లీ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. తీవ్రమైన చలి, పొగమంచు కారణంగా ఏజెన్సీ వాసులు తంటాలు పడుతున్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదివారం 11.5 డిగ్రీలు నమోదు కాగా, సోమవారం నాటికి 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చింతపల్లి ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో చలిగాలుల తీవ్రత నెలకొంది. చింతపల్లి,తాజంగి,లంబసింగి, ఆర్.వి.నగర్, జీకే వీధి ప్రాంతాల్లో తీవ్రంగా చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాడేరు మండలం మినుములూరులో సోమవారం 12 డిగ్రీలు, అరకులోయలో 13.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది.

– సాక్షి,పాడేరు

అవగాహన లోపమే అసలైన సమస్య



కేరళ అధికారులతో బృందం సభ్యులు

మన రాష్ట్రంలో మెరుగైన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అయితే అవగాహనా లోపం, పోషకాహారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం వల్ల పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాలు ఏర్పడుతున్నాయి. కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో మన కన్నా తక్కువగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా అక్కడి వారు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. ఇదే అంశాన్ని ఆయా రాష్ట్రాల పర్యటనకు వెళ్లిన బృందాలు గుర్తించాయి.

- మిగతా రాష్ట్రాల కంటే మన దగ్గరే మెరుగైన పోషకాహారం పంపిణీ
- అక్కడ పూర్తిస్థాయి అవగాహన, వినియోగం వల్లే పౌష్టికాహార లోపాలు తక్కువ
- కేరళ, పంజాబ్ రాష్ట్రాల పర్యటనలో గుర్తించిన బృందాలు

రంపచోడవరం: మహిళలు, గర్భిణులు, చిన్నారుల్లో పౌష్టికాహారలోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని అందిస్తోంది. పౌష్టికాహారలోపాన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు మరింత విస్తృతంగా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను రెండు బృందాలుగా పంజాబ్, కేరళ రాష్ట్రాలకు పంపింది. వారు నాలుగు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో పర్యటించారు. పోషకాహార లోపాలు తగ్గించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఒక్కో బృందంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ), ఒక చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్(సీడీపీవో), ఒక ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కన్సల్టెంట్, ఒక వైద్య ఆరోగ్యశాఖ కన్సల్టెంట్



కేరళలో అధికారులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

ఉన్నారు. ఒక బృందంలో రంపచోడవరం సీడీపీవో సంధ్యారాణి ఉన్నారు. అధ్యయన విషయాలను ఆమె 'సాక్షి'కి వివరించారు.

అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించిన బృందాలు పలు విషయాలపై సమగ్ర అధ్యయనం చేశాయి.
- అక్కడి ప్రజలకు పోషకాహార లోపం, దాని పరిణామాలపై అవగాహన ఎక్కువగా ఉందని, పోషకాహార లోపాలతో ఉన్న పిల్లలపై అక్కడి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారని సభ్యులు గుర్తించారు.
- ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వారు సక్రమంగా వినియోగించుకుంటున్నట్టు తెలుసుకున్నారు.
- పిల్లలను న్యూట్రిషన్ కేర్ సెంటర్‌లో చేర్పించి తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. కేరళ, పంజాబ్ రాష్ట్రాలు పోషకాహార లోపాలు, ఎనీమియా(రక్తహీనత) తగ్గించడంలో దేశంలోనే మెరుగైన ఫలితాలను సాధిస్తున్నాయి.
- ఈ పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను సభ్యులు సందర్శించారు. అక్కడి స్త్రీ శిశు సక్షేమశాఖ డైరెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులను కలిసి వారు చేపట్టిన కార్యక్రమాలను అధ్యయనం చేశారు.

అధ్యయనం వివరాలు

- నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం కేరళ, పంజాబ్‌తో పోల్చితే ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు ఇస్తున్న శాతం మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంది.
- మన రాష్ట్రంలో 68 శాతం ఉంటే, కేరళ, పంజాబ్‌లలో 55.5 శాతం మంది తల్లులు మాత్రమే ఆరు నెలల వరకు పిల్లలకు స్తన్యం ఇస్తున్నారు.
- ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలు మన రాష్ట్రంలో ఆరు శాతం ఉంటే కేరళలో 5.8శాతం, పంజాబ్‌లో 3.8 శాతం ఉన్నారు.
- మనరాష్ట్రంలో ఎనీమియాతో 48.8 శాతం మహిళలు బాధపడుతుంటే, కేరళలో 36.3 శాతం మంది మాత్రమే బాధ పడుతున్నారు. ఈ సంఖ్యలో దేశంలోనే కేరళ మెరుగ్గా ఉండడంతో పరిశీలన కోసం స్త్రీశిశు సంక్షేమ శాఖ బృందాలను అక్కడికి పంపింది.

పోషకాహార పంపిణీలో మనమే మెరుగు



కేరళలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాం. కేరళలో కంటే మన రాష్ట్రంలోనే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నాం. కేరళలో వారంలో రెండు రోజులు గుడ్డు, పాలు ఇస్తుంటే మన రాష్ట్రంలో ప్రతీ రోజు పాలు, గుడ్డు ఇస్తున్నాం. అక్కడ మనమిస్తున్నట్టు రోజులో ఒక పూట పూర్తి భోజనం లేదు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా ఐదు రకాల పోషక పదార్థాలు అందిస్తున్నాం. అయితే మన ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలి.

– సంధ్యారాణి, సీడీపీవో, రంపచోడవరం

పీవీటీజీల అభివృద్ధికి కేంద్రం నిధులు

- త్వరలో విడుదల
- వారి వివరాలు సేకరించాలి
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: దేశ వ్యాప్తంగా పీవీటీజీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు. ఇందుకోసం పాడేరు ఐటీడీఏ పరిధిలో నివసిస్తున్న పొర్జా, గదబ, కోదు సామాజిక వర్గాల పూర్తి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీవీటీజీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, త్వరలోనే విడుదలవుతాయన్నారు. పీవీటీజీ గ్రామాల్లో విద్యుత్, రహదారులు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి సామాజిక అభివృద్ధితో పాటు గృహనిర్మాణాలు, స్వయం ఉపాధి పథకాలకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. గత వారం ఢిల్లీలో ఐటీడీఏ పీవోలతో సమావేశం నిర్వహించారని చెప్పారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో పీవీటీజీల వివరాలు సేకరించాలన్నారు. ఈనెల 20తేదీ లోపు డేటా సేకరించి సమర్పించాలని సూచించారు. ఆ వివరాలతో సమగ్రమైన ప్రణాళిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవోలు ఎం.వెంకటేశ్వరరావు, వి.ఎస్. ప్రభాకర్‌రావు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివ రాత్రికి పక్కా ఏర్పాట్లు

రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్



పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఐటీడీఏ పరిధిలో మూడు గ్రామాల్లో భారీస్థాయిలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశం హాలులో సోమవారం వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంప, గురబంద, పూతిగుంట గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, ప్రత్యేక మెడికల్ క్యాంపు, మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శివరాత్రి ఉత్సవాలు జరిగే మూడు రోజులూ పోలీసు బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. రంపచోడవరం నుంచి రంప వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ సమర్పించాలని అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు పి.వెంకటేశ్వరరావు, కె.సుధాకర్ బాబు, సుబ్రహ్మణ్యం, డాక్టరు రాధిక, ఎంపీడీవోలు ఎం.వి.ఆర్.కుమార్ బాబు, ఎం.బాపన్న దొర, ఆర్టీసీ డీఎం రమణ, డీఈలు సాయి సతీష్, రాజేంద్ర బాబు, ఎ.వెంకటేశ్వరరావు, మెడికల్ అండ్ హెల్త్ అధికారి అన్నపూర్ణ, ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ జాబ్‌కార్డుదారునికి ఉపాధి

- డ్వామా పీడీ రమేష్ రామన్
- ఆయిల్‌కంపెనీ మృతుల కుటుంబాలకు పరామర్శ



పర్రెడ పంచాయతీలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రమేష్ రామన్

పెదబయలు: ఉపాధి హామీ పథకం కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ రమేష్ రామన్ ఆదేశించారు. కాకినాడ ఆయిల్ కంపెనీ ప్రమాదంలో మృతిచెందిన పెదబయలు మండలంలోని ఐదుగురి కుటుంబాలను ఆయన సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పర్రెడ,బొండాపల్లి పంచాయతీల్లోని లక్ష్మీపురం ,వంచేడిపుట్టు,చంపాపుట్టు గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలు, గ్రామానికి చెందిన ఉపాధి కూలీలతో మాట్లాడారు. గ్రామంలో ఉపాధి పనులు కల్పించకపోవడం వల్లే ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళుతున్నామని గ్రామస్తులు పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి పనులు పుష్కలంగా ఉన్నా కల్పించడంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని పీడీ గుర్తించారు. అంతకు ముందు పర్రెడ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. పంచాయతీలో గుర్తించిన పనులు, ఇంత వరకు జరిగిన పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెదబయలు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ అదనపు ఆదాయం కోసం కూడా వేరే ప్రాంతాలకు వెళుతున్నారని చెప్పారు. ఉపాధి పనులు కల్పించకపోవడంలో ఉపాధి సిబ్బంది లోపం కనబడుతోందన్నారు. మండల ఉపాధి అధికారులు పర్యవేక్షణ పెంచాలని, లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. పనులు కావాలని కోరిన ఆరు రోజుల్లో ప్రతీ కార్డుదారునికి కల్పిస్తామని చెప్పారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. స్థానిక ఎంపీడీవో విగ్గిన్స్, ఉపాధి ఏపీవో మూర్తి, సర్పంచ్‌లు రవిశంకర్,మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పనులపై కలెక్టర్ సీరియస్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: తాగునీటి పథకాల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండడంపై కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోవతే చర్యలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. తన కార్యాలయంలో సోమవారం గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. పాడేరు డివిజన్ పరిధిలోని జరుగుతున్న తాగునీటి పథకాల పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. పనులు సకాలంలోని పూర్తి చేయని అనంతగిరి డీఈ, డుంబ్రిగుడ ఏఈలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 10 తేదీ లోగా పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడిలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పోలీసు సేవలు



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఎస్పీ సతీష్ కుమార్

అరకులోయ రూరల్: ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పోలీసు శాఖ సేవలు అందిస్తోందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో పోలీసుశాఖ మొబైల్ వాహనాన్ని సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. అందుకే మొబైల్ వాహనాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ప్రధానంగా ఒడిశా రాష్ట్రాన్ని ఆనుకుని ఉండడంతో పర్యాటకుల ముసుగులో కొంతమంది గంజాయి రవాణా చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై నిఘా పెట్టినట్టు తెలిపారు. యువత జల్సాలకు అలవాటుపడి గంజాయి వ్యాపారులతో చేతులు కలిపి జైలు పాలవుతున్నారని చెప్పారు. యువతను వ్యసనాలకు దూరం చేసేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించేందుకు ఈ ప్రాంతంపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. మొబైల్ వాహనం నిత్యం అందుబాటులో ఉంటుందని, ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే సమాచారం అందిస్తే పరిష్కరించేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.డి.బాబు, ఎస్ఐ సంతోష్, ఎంపీపీ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాసిన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, సర్పంచ్‌లు సుస్మిత, దాసుబాబు, ఎంపీటీసీ సభ్యులు భీమరాజు,సత్రుగున్, సాంబ,సుంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

జెడ్పీ చెర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



లక్ష్మీపురంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

పెదబయలు: కాకినాడ ఆయిల్ కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, ఆదుకుందని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే నష్టపరిహారం ప్రకటించిందని చెప్పారు. భవిష్యత్‌లో కూడా వారి అండగా ఉంటుందన్నారు. పెదబయలు మండలం పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం, బొండాపల్లి పంచాయతీ చంపాపుట్టు గ్రామాల్లో బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి సోమవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం జరిగినట్టు సమాచారం అందిన వెంటనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్పందించారని చెప్పారు. ప్రభుత్వం, కంపెనీ నుంచి ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షల చొప్పున అందజేయనున్నట్టు ప్రకటించారని ఆమె చెప్పారు. ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ డైరెక్టర్ సోమేశ్వరి, ఎంపీపీ వరహాలమ్మ, పర్రెడ, బొండాపల్లి సర్పంచ్‌లు రవిశంకర్, మత్స్యరాజు, బంగారుమెట్ట ఎంపీటీసీ చెండా కొండమ్మ, నాయకులు జగబొందు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


తాడి ఝాన్సీ (ఫైల్)

యలమంచిలి: యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలివి. యలమంచిలి పాతవీధికి చెందిన తాడి ఝాన్సీరాణి(20) ఈ నెల 10వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీనిపై ఝాన్సీ తండ్రి తాడి శివ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- గౌరీదేవిపేట రహదారిపై ప్రమాదకర మలుపు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


గౌరీదేవిపేట రోడ్డులో ప్రమాదకర మలుపు


ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఎటపాక: ప్రమాదాలకు నిలయంగా మారింది గౌరీదేవిపేట వద్ద ఉన్న ఆర్‌అండ్‌బి రహదారి. నెల్లిపాక నుంచి కూనవరం వెళ్లే రహదారిపై ఈ మలుపు వాహనదారులకు భయాందోళన కలిగిస్తుంది. ఆదివారం రాత్రి ఓ కారు ఈ మలుపులోనే బోల్తాపడి ఓ యువకుడు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ మార్గంలో గత ఏడాది నుంచి ఇప్పటి వరకు సుమారు పది వరకు వాహనాల ప్రమాదాలు జరిగాయి. మలుపు ఎక్కువగా ఉండటంతో పాటు ఎటువంటి సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో రహదారి ప్రక్కన ఉన్న పొదలను ఆర్‌అండ్‌బీ శాఖ తొలగించే పనులు తూతూమంత్రంగా చేపట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ప్రమాదాలు జరిగే ఈ మలుపు వద్ద ఉన్న ముళ్ల పొదలను తొలగించలేదనే ఆరోపణలున్నాయి.ఈ మార్గం మీదుగా పాపికొండల విహార యాత్రకు దూరప్రాంతాల నుంచి వందల సంఖ్యలో రోజూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిలోని ఉన్న ప్రమాదకర మలుపు వద్ద దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై కఠిన చర్యలు


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ సీతారాం

పాడేరు రూరల్: పాఠశాలల్లో ఉపాధ్యాయులు తరగతులపై గైర్హాజరైతే చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ హెచ్చరించారు. పాడేరులో ఆయన సోమవారం పర్యటించారు. కాఫీ హౌస్‌లో జిల్లా విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో డ్రాపౌట్ విద్యార్థులపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతూ సొంత పనులు చక్కబెడుకుంటున్నట్టు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. విధులకు తరచూ గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుల వివరాలను త్వరితగతిన నివేదించాలని ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ సరఫరాకు అడ్డుకట్ట వేయాలని గిరిజన సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, విద్యా, వైద్యారోగ్య శాఖ, ఎక్సైజ్, డ్రగ్ కంట్రోల్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులకు సూచించారు. చిన్నారుల ద్వారా గంజాయి ఇతర మత్తు పదార్థాలు సరఫరా చేయిస్తున్న వారిని అరెస్టు చేయడమే కాకుండా కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నిర్లక్ష్యంగా వ్యవహారించే అధికారులు, సిబ్బంది జాబితా సేకరించి వారిపై క్రమ శిక్షణ చర్యలకు ఆదేశాలు ఇవ్వనున్నామన్నారు. సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు ఎం.రజిని, ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి, డీఈవో డాక్టర్ పి.రమేష్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూఓ ఎల్.రజినీ, పీఓడీటీటీ డాక్టర్ భారతి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా కన్వీనర్ లవకుశ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


బదిలీపై వెళ్తున్న డీఈవో డాక్టర్ రమేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటగిరి

సాక్షి,పాడేరు: జిల్లాలో విద్యాభివృద్ధికి విశిష్ట సేవలు అందించి, తన సొంత ప్రాంతం నెల్లూరు జిల్లాలోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ జరిగిన డీఈవో డాక్టర్ రమేష్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పలు మండలాల ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు డీఈవోను కలిసి తమ ఆత్మీయ అనుబంధంను గుర్తు చేసుకున్నారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఇక్కడ డీఈవోగా నియమితులైన శామ్యూల్ ఇంకా బాధ్యతలు చేపట్టకపోవడంతో రెండు రోజుల వరకు డీఈవోగా డాక్టర్ రమేష్ విధుల్లో ఉంటారు.

ఏరియా ఆస్పత్రిలో తొలి సిజేరియన్

తల్లి, బిడ్డ క్షేమం

చింతపల్లిరూరల్: స్థానిక ఏరియా ఆసుపత్రిల్లో సోమవారం తొలిసారిగా సిజేరియన్ కాన్పు జరిగింది. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు ఆధ్వర్యంలో సిజరింగ్ నిర్వహించారు.గతంలో సిజేరియన్ కేసులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించేవారు.అయితే అన్ని సౌకర్యాలతో పాటు వైద్యులు కూడా అందుబాటులోకి రావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో డెలివరీ కేసులు చేస్తున్నారు. మండలంలోని అంతర్లకు చెందిన పోలోజు జ్యోతి తొలి కాన్పుకోసం స్థానిక గర్భిణుల వసతిగృహంలో చేరింది. ఆమెకు సిజేరియన్ చేశారు. పాప పుట్టింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాల య్య, వైద్యాధికారులు శ్రీవిద్య, సుధాశారద, ఆదిత్యకీర్తి, రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి తదితరులున్నారు.

కల్లులో బుగ్గి పిక్కలు కలపడం వల్లే ఒకరి మృతి

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


పోలీసుల అదుపులో నిందితుడు

గూడెంకొత్తవీధి/చింతపల్లి: గూడెంకొత్తవీధి మండలం ఆకులూరులో ఈ నెల 6న జీలుగు కల్లుతాగి ఒకరు మృతి చెందిన సంఘటనలో ఒకరిని అరెస్ట్ చేశామని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. సోమవారం ఆకులూరుకు చెందిన త్రినాథ్‌రావును జీకేవీధి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఆకులూరుకు చెందిన మఠం సహదేవ్, త్రినాథ్‌రావు వరుసకు అన్నా తమ్ముళ్లు. సహదేవ్ జీలుగు కల్లు వ్యాపారం చేస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నాడు. దీంతో త్రినాథ్‌రావులో అక్కసు పెరిగింది. కల్లు చెట్లలో తనకు వాటా కావాలని అడిగాడు. అందుకు సహదేవ్ నిరాకరించాడు. దీంతో గత నెల 6న త్రినాథరావు సహదేవ్‌కు చెందిన కల్లు చెట్టులో ప్రమాదకర బుగ్గి పిక్కలు కలిపాడు. కల్లును ఆకులూరుకు చెందిన రామదాసు కుటుంబ సభ్యులు 10 లీటర్లు కొనుక్కుని తాగారు. వీరిలో ఎక్కువగా తాగిన రామదాసు చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా మిగతా ముగ్గురు వ్యక్తులు కోలుకున్నారు. మృతుడి భార్య సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా త్రినాథరావు కల్లులో బుగ్గి పిక్కలు కలిపినట్టు వెల్లడైంది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జీకేవీధి సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీ దృష్టికి గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు


ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసిన గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నానిపాత్రుడు

పాడేరు రూరల్: జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగుల పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసేలా చొరవ తీసుకోవాలని గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నానిపాత్రుడు కోరారు. పాడేరులోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఆయన సోమవారం కలిశారు. గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడులు జరిగితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీను కలిసిన వారిలో గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సత్యవతి, చంద్రశేఖర్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


సర్టిఫికెట్లను అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

పాడేరు రూరల్: గిరిజన గ్రామాల్లో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అన్నారు. పట్టణంలోని గిరిజన యువ ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జీఎస్టీ, డీఎస్‌ఎం విభాగాల్లో నిర్వహించిన శిక్షణ పూర్తి చేసుకున్న 120 మంది విద్యార్థులకు సోమవారం ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ముమ్ముందు ట్రైకార్ సంస్థ సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గిరిజన యువ ప్రగతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కుర్రబోయిన సింహాచలం, సీఈవో కె.విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి పీచు పరిశ్రమలో అగ్ని ప్రమాదం


కాలి బూడిదవుతున్న కొబ్బరి పీచు

ఎస్.రాయవరం: కొరుప్రోలు కొబ్బరి పీచు పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించి భారీ ఆస్తి నష్టం సంభవించింది. గ్రామం శివారులో ఉన్న రాయిడు క్వాయిర్ ఇండస్ట్రీలో విద్యుత్ వైర్ల నుంచి నిప్పులు రాలి పరిశ్రమలో ఆరబెట్టిన పీచుపై పడి మంటలు చెలరేగాయని పరిశ్రమ యజమాని బిక్కిన శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ మంటలు అదుపు చేసే లోగా పక్కన ఉన్న మరో పరిశ్రమ పద్మావతి క్వాయిర్ ఇండస్ట్రీలో ఉన్న పీచుకు నిప్పు అంటుకుందని చెప్పారు. ఈ రెండు పరిశ్రమల్లో సుమారు రూ.20 లక్షల విలువ చేసే పీచు, పొట్టు , బైయిల్స్ కాలిబూడిదయ్యాయని చెప్పారు. నక్కపల్లి, యలమంచిలి అగ్ని మాపక కేంద్రాల నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేశాయి. ప్రమాద వివరాలు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు నష్టం అంచనాలు వివరాలు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

జీపు బోల్తా పడి మహిళ మృతి


సుంక్రి మృతదేహం

అరకులోయ రూరల్: మాడగడ పంచాయతీ కుసుమగూడ గ్రామానికి చెందిన వంతల సుంక్రి అనే మహిళ కుటుంబ సమేతంగా డుంబ్రిగుడ మండలం ముగ్రిగూడ వివాహ వేడుకకు జీపులో వెళ్తుండగా బల్లిగెడ్డ మలుపు వద్ద జీపు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వంతల సుంక్రి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మృతదేహాన్ని అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కిల్లో అభిషేక్(20)ను విశాఖ కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి


రాంబాబు (ఫైల్)


ప్రమాదానికి గురైన కారు

అనంతగిరి: అరకు అందాలను తిలకించేందుకు వచ్చి కారు బోల్తా కొట్టిన ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అనంతగిరి పోలీసులు అందించిన వివరాలివి. విశాఖపట్నం సాగర్‌నగర్ చెందిన ఎ.రాంబాబు (51) నర్సీపటన్నం టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నారు. అరకు అందాలను తిలకించేందుకు ఆదివారం మరో ఇద్దరితో కలిసి కారులో వచ్చారు. అందాలను తిలకించి, సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో మైదానప్రాంతానికి తిరిగి వెళుతుండగా, అనంతగిరి మండలం కొడంగుడ గ్రామ సమీపంలోగల మలుపువద్ద కారు అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు గాయం కావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

బస్సు దిగుతూ చక్రం కింద పడి...

- ప్రయాణికుడి మృతి
- లుభుర్తి జంక్షన్ వద్ద ప్రమాదం


సన్యాసిరావు మృతదేహం

కొయ్యూరు: చింతలపూడి పంచాయతీ లుభుర్తికి చెందిన తూబే సన్యాసిరావు(53) బస్సు నుంచి దిగుతూ ప్రమాదవశాత్తూ వెనక చక్రం కింద పడి మరణించాడు. ఎస్‌ఐ రాజారావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం సన్యాసిరావు ఆదివారం గూడెంలో ఇంటర్మీడియట్ చదువుతున్న కూతురును చూసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అతని స్వగ్రామం లుభుర్తి వెళ్లేందుకు జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి బస్సు దిగేందుకు యత్నించారు. అయితే అతను బస్సు దిగుతున్న సమయంలో డ్రైవర్ బస్సును లాగించడంతో సన్యాసిరావు బస్సు వెనక చక్రం కింద పడిపోయారు. దీంతో అక్కడికక్కడే సన్యాసిరావు మరణించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. సన్యాసిరావు మృతితో స్వగ్రామం లుభుర్తిలో విషాదం నెలకొంది.

గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ సేవలు

- ఐదు గ్రామాల్లో గిరిజనులకు రగ్గులు, నిత్యావసర సరకులు పంపిణీ

జి.మాడుగుల: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు పోలీస్‌శాఖ చేపడుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ క్యాంప్ ఇన్‌చార్జి డీఎస్పీ రాజా కేసీ, సీఐ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం సీఆర్‌పీఎఫ్–198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే ఆదేశాల మేరకు మండలంలో వంతాల, గెమ్మెలి, కోడాపల్లి, కొక్కిరాపల్లి, సొలభం పరిసర గ్రామాలకు చెందిన పేద గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని ప్రజలకు పోలీస్‌శాఖ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ ఇన్స్‌స్పెక్టర్ నానక్‌సింగ్, ఎంవీ రవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సెంట్రల్ టీమ్ పర్యటన

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ గలగండ,జర్రిపడా గ్రామాల్లో ఢిల్లీ నుంచి వచ్చే సెంట్రల్ టీమ్ మంగళవారం పర్యటించనున్నట్టు వెలుగు ఏపీఎం దేవమంగ తెలిపారు. రెండు గ్రామాల్లో పీవీటీజీ గిరిజనుల భాషా, సంస్కృతి,ఆచార వ్యవహారాలు, స్థితిగతులు,అమలవుతున్న సంక్షేమ పథకాలుపై అధ్యయనం చేయనుందని ఆమె తెలిపారు.

సినీ నటి సుజాత సింహాద్రికి సత్కారం


అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ నటి సుజాత సింహాద్రి

మునగపాక: పలు సినిమాల్లో నటించిన సుజాత సింహాద్రిని మండలంలోని వాడ్రాపల్లి గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్రలో పేరుగాంచిన పారిపల్లెమ్మ అమ్మవారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గల్లీరౌడీ, చెక్‌పోస్టు, గాలి సంపత్, జగన్నాటకం తదితర 25 చిత్రాల్లో సుజాత సింహాద్రి నటించారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కన్నుంనాయుడు, గ్రామ పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, కొయిలాడ దశావతారం, మల్ల వరహా నరసింగరావు, పెతకంశెట్టి లీలా భాస్కర్, భాస్కరరావు, పారునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పసిడి కలశాలతో సారె ఊరేగింపు


ఊరేగింపులో భక్తులు

- రేపు గర్నికం బాలచెంచమ్మతల్లి అమ్మవారి తీర్థం

రావికమతం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థం బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులతోపాటు ఇతర గ్రామాలకు చెందిన వంద మందికి పైగా భక్తులు అమ్మవారి మాలధారణ చేసి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం గ్రామంలో పసిడి కలశాలతో సారెను ఊరేగించారు. ఈ సందర్భంగా రావికమతం నుంచి ఆ గ్రామం వరకూ భారీ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. బాలచెంచమ్మతల్లిని తలచుకుని ఏ కార్యమూ చేసినా ఫలిస్తుందని గ్రామస్తుల నమ్మకం. ఈ విశ్వాసంతోనే ఏటా నిర్వహించే అమ్మవారి తీర్థానికి జిల్లా నుంచే గాక పలు జిల్లాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

ఇంటికో టన్ను చెరకు...

అమ్మవారి ఆలయానికి భూములు, మాన్యాలు లేవు. గ్రామ రైతులంతా ఏటా అమ్మవారి పేరున చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి టన్ను చెరకు చొప్పున కేటాయిస్తుంటారు. ఈ ఆదాయంతోపాటు హుండీ కానుకలతో తీర్థాన్ని ఘనంగా నిర్వహిస్తారు.